JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | శనివారం 15-08-2026
Medchal - Malkajgiri | Saturday 15-08-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 75
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 75 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com

# భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి సర్వం సిద్ధం




**భారతదేశం తన 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడానికి సర్వసిద్ధమైంది. శనివారం, ఆగస్టు 15న ఎర్రకోట వేదికగా జరిగే జాతీయ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వరుసగా 13వ సారి జాతిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు.**

జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 14:

భారతదేశం తన 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని రేపు (శనివారం) ఆగస్టు 15న జరుపుకోనుంది. ఢిల్లీలోని ఎర్ర కోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఈ వేడుకలకు నేతృత్వం వహించనున్నారు. ఈ చారిత్రాత్మక కట్టడం నుంచి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం, ప్రధాని మోదీ జాతిని ఉద్దేశించి తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేయనున్నారు. ప్రధాని హోదాలో నరేంద్రమోదీ ఎర్రకోట నుంచి పంద్రాగస్టు ప్రసంగం చేస్తుండటం ఇది వరుసగా 13వ సారి కావడం విశేషం. ఈ జెండా పండుగ మహోత్సవంలో, జాతీయ గీతం 'వందేమాతరం' 150 ఏళ్ల అచంచలమైన వారసత్వాన్ని స్మరించుకోవడంతో పాటు, 2047 నాటికి వికసిత భారత్ దిశగా భారతదేశాన్ని నడిపించడంలో యువ శక్తి పాత్ర, వాళ్ల ఆకాంక్షలు, కీలకమైన సహకారాన్ని కూడా మోదీ తన ప్రసంగంలో ప్రస్తావించే అవకాశం ఉంది. ఎర్రకోటలో జరిగే వేడుకల సందర్భంగా 'వందేమాతరం' గీతాన్ని ఆలపించడం ఇదే మొదటిసారి కావడం మరో విశేషం.

## వరుస చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించిన భద్రాద్రి జిల్లా పోలీసులు

2 లో




2 లో

# రేషన్ కార్డుల పంపిణీకి ఆమోద ముద్ర

- గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ పథకాల విస్తరణ పైనా చర్చ
- రేపటినుండే స్మార్ట్ రేషన్ కార్డులు.. హోలోగ్రామ్ నుంచి QRకోడ్ వరకు సూపర్ సెక్యూరిటీ
- యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్

జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 14:

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శుభ సందర్భంగా తెలంగాణలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం నిర్ణయించింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. గతంలో రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా రేషన్ కార్డుల జారీ చేసి 62 లక్షల మందికి లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో ఈరోజుకు మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు ఉండగా, వారందరి స్మార్ట్ రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. గత ఏడాది నిర్వహించినట్లే, ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని తీర్మానించింది. ఈ సదస్సును డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ఆవిష్కరిస్తారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహిస్తారు.

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి మండలి తీర్మానించింది.



# చీకట్లో చికిత్సలు..

- కొండాపూర్ జిల్లా దవాఖానలో సమస్యల విలయతాండవం..
- నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర అవస్థలు
- పనిచేయని జనరేటర్.. ఒక్కరోజుకే సరిపోయిన సోలార్ విద్యుత్
- టార్చ్‌లైట్లు, సెల్‌ఫోన్ వెలుగులో శస్త్రచికిత్సలు
- మంచినీటి కొరతతో స్ట్రెచర్లపై టబ్బుల్లో నీళ్లు మోస్తున్న సిబ్బంది
- మందుల కొరతతో రోగుల ఇబ్బందులు
- కోట్లతో అభివృద్ధి అంటున్న ప్రభుత్వం.. ఆసుపత్రిలో కనీస సౌకర్యాలే కరువు

జయభేరి, రంగారెడ్డి జిల్లా :

కొండాపూర్ లోని రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ దవాఖానలో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒకటిగా చెప్పుకునే దవాఖానలో గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లేకపోవడంతో అత్యవసర సేవలు సైతం స్తంభించే పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఉపయోగించాల్సిన జనరేటర్ కూడా పనిచేయడం లేకుండా పోయింది. సోలార్ వ్యవస్థ ద్వారా వచ్చిన విద్యుత్ ఒక్కరోజు మాత్రమే అందుబాటులో ఉండటంతో ఆ తర్వాత పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దీంతో కొన్నిచోట్ల టార్చ్‌లైట్లు, సెల్‌ఫోన్ ఫ్లాష్‌ల వెలుగులోనే వైద్యులు అత్యవసర శస్త్రచికిత్సలు నిర్వహించాల్సి వస్తుంది. విద్యుత్ సమస్యతో పాటు ఆసుపత్రిలో మంచినీటి కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. నీటి సరఫరా లేక స్ట్రెచర్లపై టబ్బులు పెట్టి నీటిని తరలిస్తున్న దృశ్యాలు అక్కడి దుస్థితికి అద్దం పడుతున్నాయి. మరోవైపు రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. కోట్ల రూపాయల అభివృద్ధి పనుల పేరుతో

...మిగతాది 2 లో

# జగన్ కంచుకోట పై టీడీపీ బ్రహ్మాస్త్రం..!!

- ప్రొద్దుటూరు పాలిటిక్స్..!
- వరద vs ఉక్కు ప్రవీణ్
- లింగారెడ్డి వైపు అధిష్టానం చూపు..?



జయభేరి, కడప, ఆగస్టు 14:

రాయలసీమ జిల్లాల్లో రాజకీయాలు వాడీవేడీగా సాగుతున్నాయి. ఉమ్మడి చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పొలిటికల్ హీట్ క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు 2029 ఎన్నికలకు వారి పార్టీ అభ్యర్థులను ఫైనలైజ్ చేసే పనుల్లో నిమగ్నమయ్యాయి. ఈ నేపథ్యంలోనే టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్నవారిపై వచ్చే ఎన్నికల్లో వేటు తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి కడప జిల్లా పై టీడీపీ అధిష్టానం ఫోకస్ చేసినట్లుగా తెలుస్తోంది. ఉమ్మడి కడప జిల్లా... రాష్ట్ర రాజకీయాలు ఒక ఎత్తు.. కడప జిల్లా పాలిటిక్స్ మరో ఎత్తు అన్నట్లుగా ఉంటాయి.

...మిగతాది 2 లో



2 లో

# గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్ల నిధులు

- గోదావరి పుష్కరాల సన్నద్ధత, ఏర్పాట్లపైన అధికారులకు దిశా నిర్దేశం
- సమగ్ర ఏర్పాట్ల కోసం రూ. 1000 కోట్లతో వివిధ శాఖల పరిధిలో పనులు
- గోదావరి పుష్కరాల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి
- గోదావరి పుష్కరాల స్పెషల్ ఫండ్స్ వినతులపై సీఎంతో చర్చిస్తానన్న మంత్రి శ్రీధర్ బాబు

జయభేరి, హైదరాబాద్ :

గోదావరి పుష్కరాలను తెలంగాణా సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈసారి గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని, అందుకు సంబంధించిన పనులు సెప్టెంబర్ మొదటివారంలో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## రేషన్ కార్డుల పంపిణీకి ఆమోద ముద్ర

యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. ఈసారి గతంలో ఎన్నడూలేని విధంగా 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసిన అంశంపై చర్చించింది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుంది.

మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించాలని తీర్మానించింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి, ఈ వేలం (eAuction) ద్వారా ధాన్యం విక్రయించాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేవడానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేస్తారు. కొత్తగా ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రాష్ట్రంలో తొలి విడతగా 113 నియోజకవర్గాల్లో YIIRS కాంప్లెక్స్ లను నిర్మించగా, ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. CURE పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి, హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది.

హైదరాబాద్ లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలున్నాయి. వాటిని ఈవీ లుగా మార్చేందుకు రూ. 200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1 లక్ష 50 వేలు సబ్సిడీ అందిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించనున్నారు. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన HILT పాలసీ దరఖాస్తు గడువును మంత్రిమండలి మరో 3 నెలలు పొడిగించింది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. మక్తల్‌నారాయణపేటకొడంగల్ ఎత్తిపోతల ఫేజ్ II పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందుతుంది. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

## గోదావరి పుష్కరాలకు వెయ్యి కోట్ల నిధులు

టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో గోదావరి పుష్కరాలకు సంబంధించి అనేక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు శాఖల వారీగా గోదావరి పుష్కరాల సన్నద్ధత, ఏర్పాట్లపైన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. 26 జూన్ 2027 నుంచి 7 జూలై 2027 వరకు గోదావరి నది తీరం పుష్కర శోభతో విరాజిల్లేలా, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినేట్ సబ్ కమిటి సంకల్పించింది. పుష్కరాల సందర్భంగా గోదావరి తీరం వెంబడి ఘాట్ల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేసి, దేశం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గోదావరి పుష్కరాల సమగ్ర ఏర్పాట్ల కోసం రూ. 1000 కోట్లతో వివిధ శాఖల పరిధిలో పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు.

**గోదావరి పుష్కరాల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి: మంత్రి శ్రీధర్ బాబు**

ఈ సందర్భంగా కేబినేట్ సబ్ కమిటి ఛైర్మన్, మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల పనుల పురోగతిని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. వీలుకాని పక్షంలో వర్చువల్ మీటింగ్ ల ద్వారా పనులను సమీక్షించాలని సూచించారు. గోదావరి పుష్కరాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక కార్యక్రమంగా భావిస్తున్నందున ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన పనుల పురోగతిని ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు డ్యాష్‌బోర్డు ద్వారా సమీక్షించేందుకు వీలుగా, శాఖల వారీగా చేపడుతున్న పనులు, పురోగతి తదితర వివరాలు అందుబాటులో ఉండేలా డ్యాష్‌బోర్డును రూపొందించాలని అధికారులను శ్రీధర్ బాబు ఆదేశించారు. గోదావరి పుష్కరాల నిమిత్తం స్పెషల్ ఫండ్స్ కావాలని పలువురు ప్రజాప్రతినిధుల నుంచి వినతుల వస్తున్నందున ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గోదావరి తీర ప్రాంతం సుదీర్ఘంగా వున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి గోదావరి పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించాలని సూచించారు.

## చీకట్లో చికిత్సలు..

ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, రాష్ట్ర రాజధానిలోని ప్రధాన జిల్లా దవాఖానలో విద్యుత్, నీరు, జనరేటర్, మందులు వంటి ప్రాథమిక సదుపాయాలే లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రాణాలను కాపాడాల్సిన దవాఖాన ఇలా సమస్యలతో సతమతమవుతుండగా, అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించడం, జనరేటర్ మరమ్మతులు చేపట్టడం, రోగులకు అవసరమైన మందులు, మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రెండు హత్యలు చేసి.. యాధావిధిగా విధులకు హజరు

■ నిందితులను పట్టించిన సీసీ ఫూటేజీ

**జయభేరి, సూర్యాపేట :**

సూర్యాపేట జిల్లా భార్యాభర్తల హత్యకేసులలో కానిస్టేబుల్ పాత్ర పలు మలుపులు తీరిగింది. కానిస్టేబుల్ షరీఫ్ హత్య చేసిన తర్వాత మోతె నుంచి సూర్యాపేట వెళ్లిపోయాడు. బుధవారం యథావిధిగా విధులకు హాజరైయాడు. ఘటనా స్థలంలో మృతదేహాలను వెలికితీసే సమయంలో అక్కడే విధుల్లో పాల్గొన్నాడు. తనకేం తెలియదన్నట్లు అమాయకంగా ప్రవర్తించాడు. స్థానికులు ఘటనా స్థలంలోకి వస్తున్న సమయంలో ఆధారాలు చెదిరిపోతాయంటూ అరిచాడు. అయితే, సీసీ ఫూటేజీ ఇద్దరి హత్య కేసులో నిందితులను పట్టించింది. గుంతను పూడ్చేందుకు పార తీసుకెళ్తున్న సుందరయ్యల విజువల్స్ సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. పోలీసులు సుందరయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. షరీఫ్ గతంలోనే ఓసారి బూబా హత్యకు ప్లాన్ వేసాడు. షరీఫ్ చంపిన బూబా(42) . ఇద్దరిని హత్య చేసిన కానిస్టేబుల్ షరీఫ్ (26).

# తెలుగు రాష్ట్రాల్లో కనిపించని జెన్ జీ



ఆధునిక రాజకీయాల్లో జెన్ జీ ఓటర్లు అత్యంత కీలకమైన శక్తిగా మారుతున్నారు. జెన్ జీ వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాలను గడగడలాడించిన దృశ్యాలను చూసి, తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలు కూడా ఈ తరాన్ని తమవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే, గడిచిన కొద్దికాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే.. పార్టీలు ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జెన్ జీ కార్డు క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా జెన్ జీ ఆధారిత ప్రచారాన్ని తీవ్రంగా నడిపే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ చదువుల్ని క్రిమినల్ వేస్ట్ అని సంబోధించడంతో యువ ఇంజనీర్లందర్నీ అలా అన్నారని కేటీఆర్ క్యాంపెయిన్ చేశారు. క్రిమినల్ వేస్ట్, అన్ ఫిట్ వంటి హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్ కల్చర్‌తో యంగ్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూశారు. అయితే, ఈ మీమ్స్ సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌గా మాత్రమే మిగిలిపోయాయి తప్ప, నిరుద్యోగ యువతను లేదా కాలేజీ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాస్ ప్రొటెస్ట్‌గా మార్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది.ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరోలా ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని పునర్నిర్మించే క్రమంలో యువతను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ప్రయత్నించింది. అయితే, నిజమైన తటస్థ జెన్ జీ యువతను భాగస్వాములను చేయడం కంటే, ఇప్పటికే పార్టీలో ఉన్న తమ అనుబంధ విద్యార్థి విభాగం, ఐటీ సెల్ కార్యకర్తలకే జెన్ జీ అనే కొత్త ల్యాబెల్ వేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం కనిపించింది. డీఎస్సీ పోరాటాల్లో ఈ పద్ధతి ఎక్కువగా ఉంది. కేవలం పార్టీ ప్రచార పత్రాలు పట్టుకుని ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్‌లలో హల్‌చల్ చేయడం వల్ల అది కేవలం ఆర్గనైజ్డ్ పార్టీ ప్రచారంగానే మిగిలిపోయింది తప్ప, ఏపీలోని సాధారణ యువతలో ఎలాంటి పొలిటికల్ అప్‌రైజింగ్‌ను తీసుకరాలేకపోయింది. తెలుగు యువతలో అత్యధిక శాతం మంది ఐటీ ఉద్యోగాలు, యూఎస్/యూకే ఉన్నత చదువులు, గ్రూప్స్. సివిల్స్ , ఇతర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలోనే నిమగ్నమై ఉన్నారు. డిజిటల్ స్పేస్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినా, రోడ్లెక్కి నిరసన తెలిపితే నమోదయ్యే క్రిమినల్ కేసులు తమ భవిష్యత్తు, వీసా అవకాశాలను దెబ్బతీస్తాయనే హెచ్చరిక వారిని వెనక్కి లాగుతోంది. నేటి తరం రాజకీయ వ్యతిరేకతను లేదా మద్దతును రీల్స్, మీమ్స్, ఎక్స్ , స్పేసెస్, డోపమైన్ ఇచ్చే డిజిటల్ కంటెంట్ రూపంలోనే చూపిస్తోంది. వీధి పోరాటాల కంటే డిజిటల్ ట్రోలింగ్‌నే వారు సౌకర్యవంతమైన యాక్టివిజంగా భావిస్తున్నారు.రాజకీయ పార్టీలు జెన్ జీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో పొరబడుతున్నాయి. నాయకులు వేసే మీమ్స్ లేదా వాడే జార్గన్స్ చూసి తమను వారు ప్రతిబింబిస్తున్నారని యువత భావించడం లేదు. పార్టీలు ప్రదర్శించే ప్రచా కృత్రిమమైనది గా ఉండటంతో యువత సులభంగా గుర్తిస్తోంది. ఉపాధి అవకాశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్, గిగ్ ఎకానమీ కార్మికుల సమస్యలు, స్టార్టప్ ఈకోసిస్టమ్, ప్రాజెక్టుల పురోగతి వంటి నిజమైన ఎజెండా వదిలేసి.. కేవలం వ్యక్తిగత దూషణలు, రాజకీయ ట్రోలింగ్ చుట్టూ తిరిగే కంటెంట్‌ను జెన్ జీ లైట్ తీసుకుంటోంది.రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయనంత మాత్రాన తెలుగు జెన్ జీకి రాజకీయ స్పృహ లేదనుకోవడం పార్టీల పెద్ద పొరపాటే అవుతుంది. వారు నిశ్శబ్దంగా గమనించే సైలెంట్ ఓటర్లు . బూత్ లెవల్‌కి వచ్చి ఓటు వేసే సమయంలో సాంప్రదాయ కుల, ప్రాంతీయ సమీకరణల కంటే.. వ్యక్తిగత స్వాతంత్ర్యం, ఉద్యోగ కల్పన, పారదర్శక పాలన అందించే నాయకులకే ప్రాధాన్యత ఇస్తారు. ఏదైనా ఒక రాజకీయ పార్టీ తమ సొంత ప్రయోజనాల కోసం తమను పొలిటికల్ టూల్ గా వాడుకోవాలని చూస్తే తిరస్కరించడంలో ఈ తరం ముందే ఉంటుంది. నాయకులు కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే విజన్‌ను చూపినప్పుడే ఈ తరం ఓటర్లు నిజమైన మద్దతుదారులవుతారు.



## వరుస చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించిన భద్రాద్రి జిల్లా పోలీసులు

■ 8 మంది నిందితుల అరెస్ట్.. ఒకరు అంతర్రాష్ట్ర నేరస్తుడు..

■ రూ.26 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

**జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరుసగా జరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు సమర్థవంతంగా ఛేదించారు. అశ్వారావుపేట, దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన వరుస చోరీ కేసులపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి సుమారు 150 గ్రాముల బరువున్న 6 బంగారు గొలుసులను, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ సుమారు రూ.26 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రధాన నిందితుడు సున్నం నాగేంద్రబాబు @ నాగేంద్ర తన సహచరులతో కలిసి రాత్రి వేళల్లో ఇళ్ల బయట నిద్రిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడని దర్యాప్తులో వెల్లడైంది. మహిళల మెడలోని బంగారు గొలుసులను ఎలక్ట్రిక్ వైర్ కట్టర్‌తో కట్ చేసి క్షణాల్లో అపహరించి, ద్విచక్ర వాహనాలపై అక్కడి నుంచి పరారయ్యేవారు. కొన్ని సందర్భాల్లో ముందుగానే ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటిని తదుపరి నేరాలకు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితులు తమ వద్ద ఉంచుకోకుండా, ముఠాకు సహకరిస్తున్న మహిళల వద్ద దాచిపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల విచారణలో దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 10 కేసులకు సంబంధించి కీలక ఆధారాలు లభించాయి. ఈ ముఠాలో ప్రధాన నిందితుడైన సున్నం నాగేంద్రబాబు, వయస్సు 35 సంవత్సరాలు, ఉసిర్లగూడెం గ్రామం, అశ్వారావుపేట మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇతనిపై అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, బూర్గంపాడు, పాల్వంచ, భద్రాచలం, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 83 దొంగతనం కేసులు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇతనితో పాటు వల్లూరి శాంతరాజు @ రాజు, ఉకే భద్రం @ వీరభద్రం, బెత్తి కార్తిక్, ఊర లింగయ్య, బెత్తి ఆదిలక్ష్మి, కల్లూరి లావణ్య, అల్లం సారమ్మ @ సర్లమ్మలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో వల్లూరి శాంతరాజుపై 11 దొంగతనం కేసులు, ఊర లింగయ్యపై 12 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసుల్లో మరో నిందితుడైన తమ్మిశెట్టి బాలవీరస్వామి, వయస్సు 50 సంవత్సరాలు, మాధాల గ్రామం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఇతను అంతర్రాష్ట్ర నేరస్తుడిగా గుర్తించామని, అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పి తెలిపారు. దర్యాప్తులో భాగంగా పార్కలగండి, దమ్మపేట పరిధిలో వృద్ధ మహిళను లక్ష్యంగా చేసుకుని బంగారు నానుతాడు చోరీ చేసినట్లు, బూర్గంపాడు పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు, పాల్వంచ రూరల్ పరిధిలో మరో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం చోరీ చేసిన వాహనాలను ఉపయోగించి బూర్గంపాడు, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ ప్రాంతాల్లో మహిళల మెడలోని బంగారు గొలుసులను చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతాయిగూడెం కేసులో ప్రధాన నిందితుడి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు చైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇతర కేసుల్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుల సహకారంతో వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వరుస చైన్ స్నాచింగ్ కేసులను సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఎస్పీ తెలిపారు. ఈ కేసుల ఛేదనలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్ఐలు రాజేశ్ కుమార్, యయాతి రాజు, బాలస్వామినాధం, దేవ్ సింగ్, హెచ్‌సీ ప్రసాద్, పీసీలు వెంకట్,ధర్మారావు, లక్ష్మయ్య, రామకృష్ణారెడ్డి, బాలకృష్ణ, నరసింహారావు, డబ్ల్యూపీసీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## జగన్ కంచుకోట పై టీడీపీ బ్రహ్మాస్త్రం..!!

ఎందుకంటే కడప జిల్లా వైయస్ ఫ్యామిలీకి అడ్డాగా ఉందనే విషయం బహిరంగ రహస్యమే. అయితే 2019 ఎన్నికల్లో కడప జిల్లాను వైసీపీ క్లీన్ స్వీప్ చేయగా...2024లో సీన్ రివర్స్ అయ్యింది. మెజార్టీ స్థానాలు కూటమి సాధించింది. ఇక కడప జిల్లా రాజకీయాల్లో ప్రొద్దుటూరు నియోజకవర్గం చాలా కీలకమైనది. 2019లో వైసీపీ నుంచి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విజయం సాధించగా..2024లో నంద్యాల వరదరాజుల రెడ్డి టీడీపీ నుంచి గెలుపొందారు. వాస్తవానికి ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రొద్దుటూరు నుంచి 2024లో టీడీపీ టికెట్ ఆశించినప్పటికీ అధిష్టానం మాత్రం వరదరాజుల రెడ్డికే అవకాశం వచ్చింది. అంతకుముందు అంటే వైయస్ ప్రభంజనం ఉన్నప్పుడు టీడీపీ నుంచి లింగారెడ్డి గెలిచారు. తాజాగా ప్రొద్దుటూరు నియోజకవర్గం పై టీడీపీ దృష్టి సారించింది. ఇందుకు కారణం అక్కడ స్థానిక టీడీపీ నాయకుల మధ్య సమన్వయం లేకపోవడమే అని సమాచారం. వరదరాజుల రెడ్డి వర్గం ఒక వైపుండగా.. ప్రవీణ్ కుమార్ రెడ్డి వర్గం మరో వైపుంది. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి ఉంది. దీంతో అధిష్టానానికి కూడా తలనొప్పిగా వ్యవహారం తయారైంది. ఇక ప్రొద్దుటూరులో అన్ని శాఖల్లో అవినీతి కూరుకుపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక వరదరాజుల రెడ్డి తీసుకునే ప్రతీ నిర్ణయంపై ప్రవీణ్ కుమార్ రెడ్డి బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు.ఎస్ఎస్ మాల్ విషయంలో ఇరు వర్గాలు పరస్పర దాడులకు సైతం దిగాయి. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలోనే మంత్రి నారా లోకేష్ కడప జిల్లా పర్యటన సందర్భంగా ప్రొద్దుటూరు పొలిటికల్ పంచాయితీపై ఫోకస్ చేశారు. పార్టీ లైన్ క్రాస్ చేసినవారికి స్ట్రిక్ట్ వార్నింగ్ ఇచ్చారు. ఉంటే పార్టీలో ఉండాలని ఇష్టం లేకపోతే వెళ్లిపోవచ్చని గట్టిగా నాయకులకు, క్యాడర్‌కు హెచ్చరించారు. అంతేకాదు వరదరాజుల రెడ్డి తీరు కూడా మార్చుకోవాలని మంత్రి లోకేష్ సున్నితంగా చెప్పినట్లు సమాచారం. ఈ గ్రూప్ వార్‌కు బ్రేక్ వేసేందుకు టీడీపీ అధిష్టానం మరో కొత్త ఫార్ములాతో ముందుకు వస్తున్నట్లు సమాచారం. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టీడీపీ నేతల మధ్య ఇంటర్నల్ వార్ తారాస్థాయికి చేరడంతో అధిష్టానం కూడా పునరాలోచనలో పడింది. 2029 ఎన్నికలకు మరో అభ్యర్థిని రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మృదు స్వభావిగా పేరున్న లింగారెడ్డి 2014 తర్వాత రాజకీయాల్లో అంత యాక్టివ్‌గా లేరు. ఈ మధ్యనే తిరిగి నియోజకవర్గంలో గడప గడపను పలకరిస్తూ.. క్రియాశీలకంగా కనిపిస్తున్నారు. లింగారెడ్డికి అధిష్టానం నుంచి హామీ వచ్చిందనే వార్త ఇప్పుడు ప్రొద్దుటూరులో ప్రచారంలో ఉంది. అందుకే పొలిటికల్‌గా యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. వైయస్ గాలి వీస్తున్న సమయంలో కూడా లింగారెడ్డి ఎమ్మెల్యేగా ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి గెలిచారు. ఆ తర్వాత పార్టీలో పలు పదవుల్లో కొనసాగారు. మొత్తానికి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో వరదరాజులరెడ్డికి అధిష్టానం చెక్ పెడుతుందా.. ప్రవీణ్ కుమార్ రెడ్డికి మంత్రి లోకేష్ మద్దతు లభిస్తుందా..రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి లింగారెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీచేస్తారా అనే విషయాలపై పూర్తి క్లారిటీ రావాలంటే మరికొంత కాలం వేచిచూడక తప్పదు.

# యాదాద్రి ఆలయ పాలక మండలి సమావేశం

- కొండపైన దీక్షాపరుల మండపం,నిత్య కల్యాణ మండపం నిర్మించేందుకు నిర్ణయం
- మోడల్ గోశాల,అన్న ప్రసాదం విస్తరణకు నిర్ణయం
- కొండ కింద రెండో కల్యాణకట్ట నిర్మించేందుకు ఆమోదం

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగష్టు 14 :**




యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం జరిగింది. యాదగిరిగుట్ట పట్టణంలోని రాష్ట్రపతి భవన్‌లో రెండోసారి సమావేశమైన పాలక మండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సమావేశంలో మొత్తం 26 అంశాలతో పాటు 5 టేబుల్ ఎజెండా అంశాలను ఆమోదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ధర్మకర్తల మండలి సమావేశ వివరాలను యాదగిరిగుట్ట ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం .సత్యనారాయణరెడ్డి వివరించారు. యాదగిరి కొండపైన పుష్కరిణి దగ్గర రూ.43.12 కోట్లతో దీక్షాపరుల మండపం నిర్మించాలని నిర్ణయించారు. బాలాలయం స్థలంలో రూ.9.87 కోట్లతో నిత్య కళ్యాణ మండపం,రాయిగిరి దగ్గర ప్రస్తుతమున్న ఆర్చి స్థానంలో భారీ ఆర్చిని రూ.3.16 కోట్లతో నిర్మించనున్నామని,చైర్మన్ తన సొంత ఖర్చులతో నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానం పరిసర ప్రాంతంలో వేద పాఠశాల,విశ్వవిద్యాలయం, 40 ఎకరాలలో మోడల్ గోశాల ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తుల సంఖ్యను ప్రస్తుతమున్న 1,500 మంది నుండి 2,000 మందికి పెంచేందుకు,పరిశుభ్రత ప్రమాణాలతో అన్నప్రసాదాలను తయారు చేయడానికి అవసరమైన పరికరాల కోసం రూ.18 లక్షలతో టెండరు ద్వారా కొనుగోలు చేయడానికి ఆమోదించారు.




ఆలయంలో టీసీఎస్ సంస్థ సహకారంతో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,ఆన్‌లైన్ సేవలు, ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థ తదితర సౌకర్యాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. విజన్2047 లక్ష్యాలకనుగుణంగా దేవస్థానం అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు వ్యూహ పత్రం తయారు చేసేందుకు ఐఎస్బి వారిని నియమించేందుకు ఆమోదం తెలిపారు. దేవస్థానంలో ఆర్థిక క్రమశిక్షణ, పనుల నాణ్యత, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత,ఆలయ ఆస్తుల నిర్వహణ కోసం ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రత్యేక సబ్‌కమిటీలు, కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. యాదగిరిగుట్ట దేవస్థానంపై పడే ఆర్థిక భారన్ని తగ్గించేందుకు భవన సముదాయాలు ,పార్కింగ్ స్థలాలలో 4 మెగా వాట్లతో సోలార్ గ్రిడ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతంలోని ప్రధాన కూడళ్లలో గరుడాళ్వార్,యాద ఋషి, శ్రీరామానుజులు, ప్రహ్లాదుడు, శ్రీఆంజనేయ స్వామి వారి రాతి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు.

వయోవృద్ధులు, మహిళలు, చిన్నారుల సౌకర్యార్థం కొండకింద తులసీ కాటేజీ దగ్గర రెండో కళ్యాణకట్టను రూ.9 లక్షలతో నిర్మించేందుకు నిర్ణయించగా ,నిర్మాణాన్ని ధర్మకర్తల మండలి సభ్యుడు గుండా మల్లయ్య తన సొంత ఖర్చులతో నిర్మించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొండపైన వేంచేపు మండపం పక్కన డోనార్ ఎమినిటి సెంటర్, బస్టాండ్ ఉత్తర భాగంలో పిలిగ్రిమ్ ఎమినిటి సెంటర్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. భక్తులకు స్పష్టంగా కనిపించే విధంగా గతంలో ఉన్న మాదిరిగా ఆలయ దక్షిణ భాగంలో ఎలక్ట్రానిక్ శంఖ చక్ర నామాలను లైటింగ్‌తో ఏర్పాటు చేయడానికి ఆమోదించారు. లైటింగ్‌ను ధర్మకర్తల మండలి సభ్యురాలు కొణిదెల సురేఖ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొండపైన విష్ణు పుష్కరిణి ప్రాంతాన్ని కోతుల నుండి రక్షించేందుకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి ఆమోదించగా ధర్మకర్తల మండలి సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొండపైకి వచ్చే మెట్ల మార్గంలో దాతల సహకారంతో షెడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించారు. ప్రముఖులు వ్యక్తిగతంగా ఆలయాన్ని సందర్శించినప్పుడు మాత్రమే ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటు చేయబడుతుందని, ప్రముఖుల సిఫారసు లేఖలు, ఫోన్ సందేశాల ఆధారంగా వాహనాలు కొండపైకి ప్రవేశానికి,దర్శనం పొందేందుకు నిర్దేశించిన టిక్కెట్లను తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి 30 శాతం గ్రాంట్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని,త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఈ సమావేశంలో యాదగిరిగుట్ట ఆలయ పాలక మండలి సభ్యులు వినోద్ వెంకట స్వామి, కొణిదెల సురేఖ, విజయ రాజారాం, తూళ్ళ విజయేందర్ గౌడ్, గుండా మల్లయ్య, ఈశ్వరమ్మ యాదవ్, రాఘవేందర్ రావు, లక్ష్మి నారాయణ నాయక్, ఎక్స్ అఫీషియో సభ్యులుగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, వైటిడిఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ఆలయ ప్రధాన అర్చకులు వెంకటాచార్యులు, శ్రీనివాస్ రాజు, ఆలయ డిప్యూటీ ఈవో బాస్కర్ శర్మ, ఆలయ ఏఈవోలు గజవెల్లి రఘు, శ్రవణ్ కుమార్, కృష్ణ,సురేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## గొర్రెలకాపరుల ఎన్సీడీసీ రుణాలను మాఫీ చేయాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, ఆగష్టు 14 :**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎన్సీడీసీ రుణాలను ప్రభుత్వం తక్షణమే మాఫీ చేయాలని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం యాదగిరిగుట్టలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం జోగు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మద్దెపురం రాజు మాట్లాడుతూ గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గతంలో ఎన్సీడీసీ ద్వారా అందించిన రుణాలు అనేక మంది గొర్రెల కాపరులకు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక భారంగా మారాయని, రుణాల చెల్లింపుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాపరులపై ఒత్తిడి పెంచకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్సీడీసీ రుణాలకు సంబంధించి గొర్రెలకాపరులు మార్టిగేజ్ చేసిన భూములను వెంటనే విడుదల చేసి, సంబంధిత పత్రాలను తిరిగి రైతులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే గొర్రెల కాపరులను సమీకరించి ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దయ్యాల నర్సింహ్మా, నేతలు కర్రె మల్లేశం, కాదూరి కృష్ణ, కొక్కలకొండ దేవేందర్, బీర్ల రాములు, గుండా ప్రవీణ్, సుంకె కనకయ్య,కాదూరి శేఖర్, వడ్డె గౌరయ్య, బుడిగె కృష్ణయ్య, నక్కల బాలనర్సయ్య, చిన్నం రాములు,సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబలో ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతుల శ్రావణమాసం పూజలు

- శ్రావణ శుక్రవారం సందర్భంగా పూజలు
- దేవాలయం వద్ద ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం



**జయభేరి, దేవరకద్ర :**

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దంపతులు శుక్రవారం అలంపూర్ జోగులాంబ అమ్మవారి శక్తి పీఠాన్ని దర్శించుకున్నారు. అలాగే బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని కూడా వారు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాలలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులపై పురోహితులు అక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. జోగులాంబ దేవాలయానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు ఆలయ మర్యాదలతో దేవస్థానం నిర్వహకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే దంపతులకు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్త అరవింద్ కుమార్ రెడ్డి దంపతులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## దేవరకద్రలో వికసించిన "బ్రహ్మ కమలం"

- సాంప్రదాయ రీతిలో పూజలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని వ్యాపారి ఆనంద్ ఇంట్లో గురువారం రాత్రి బ్రహ్మ కమలం పువ్వు పూసింది. ఏడాదిలో ఒకరోజు పూసే ఈ పువ్వుకు ఇంటి యజమానులు సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో అనాదిగా వస్తున్న ఆచారం ప్రాకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూసిన బ్రహ్మ కమలం పువ్వును చూడడానికి గ్రామస్తులు ఎంతో ఆసక్తి కనబరిచారు.ఈ కార్యక్రమంలో ఇంటి యజమానులతో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- యాదగిరిగుట్ట పిహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**జయభేరి, యాదగిరిగుట్ట :**



ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు,సిబ్బంది పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది హాజరు,రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత,పరీక్షలు, ప్రసూతి సేవలు,భవన నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విధులకు సిబ్బంది అందరూ హాజరయ్యారా.. ఎవరైనా గైర్హాజరయ్యారా అని కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో (అభా)లో కూడా నమోదైన వివరాలు పరిశీలించారు. విధులకు క్రమం తప్పకుండా హాజరై ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి రోజు పీహెచ్‌సీలో రోజువారీగా ఎంతమంది రోగులు ఓపీకి వస్తున్నారని అడిగి తెలుసుకొని,ఓపీకి వచ్చిన ప్రతి రోగి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా అని ఫార్మసిస్ట్‌తో ఆరా తీశారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, మందుల నిల్వలు,పంపిణీపైన వివరాలు తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకొని పీహెచ్‌సీలో అందుబాటులో లేని పరీక్షలకు సంబంధించిన నమూనాలను ఏ ల్యాబ్‌కు పంపిస్తున్నారనే విషయంపై ఆరా తీశారు. ప్రతి నెల ఆసుపత్రిలో ఎన్ని డెలివరీ జరిగాయని, గత నెలలో,ఈ నెలలో ఎన్ని ప్రసవాలు జరిగియని, వాటిలో హైరిస్క్ గర్భిణీలు ఎంతమంది ఉన్నారని తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, నిరంతర పర్యవేక్షణ, అవసరమైన చికిత్సలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో జరుగుతున్న సివిల్ పనులను పరిశీలించిన కలెక్టర్, ప్రస్తుతం పనులు ఎంతవరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా వైద్యాధికారి మనోహర్,పీహెచ్‌సీ వైద్యురాలు పావని,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే దంపతులు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం చౌలతాడాలో శుక్రవారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దంపతులు ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. గ్రామంలో నిర్మించిన కొర్ర లక్ష్మీ రవి నాయక్ ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే దంపతులు ఈ సందర్భంగా ప్రారంభించారు. అనంతరం అక్కడ జరిగిన గృహప్రవేశ పూజా కార్యక్రమంలో వారు పాల్గొని ఇంటి యజమాలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తమ కుటుంబం తరపున ఇందిరమ్మ ఇంటి యజమానులకు నూతన వస్త్రాలను అందజేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులకు గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పుస్తెమెట్టలు అందజేసిన సరోజ్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్న చింతకుంట మండలం తిరుమలపూర్ లో శుక్రవారం ఆడబిడ్డ వివాహానికి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది మందడి సరోజ్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నెల్విడి, నర్సింగాపురం గ్రామాలకు కాంగ్రెస్ నూతన కార్యవర్గాలు

- హాజరైన ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**




మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు, మదనాపురం మండలంలోని నెల్విడి, నర్సింగాపురం గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు జి.భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనుంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ నూతన కమిటీలను ప్రకటించారు. నెల్విడి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. మల్లేష్ యాదవ్, నర్సింగాపురం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్ల బ్రహ్మయ్య లను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షులుగా బడుగుల మొగిలన్న ప్రధాన కార్యదర్శులుగా బడుగుల దావీదు, తిరుమలేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మన్యంకొండ లను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, పార్టీ నాయకత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు ఘనంగా అభినందనలు తెలిపారు.

## వాసవి మాత వార్షికోత్సవానికి రండి..!

- ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులకు ఆర్యవైశ్యుల ఆహ్వానం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో కొలువుదీరిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం 9వ వార్షికోత్సవ మహోత్సవానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ను స్థానిక ఆర్యవైశ్యులు శుక్రవారం ఆహ్వానించారు. ఈనెల 17 నుండి అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. కావున ఈ మహోత్సవాలకు రావాలని స్థానిక ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాన్ని వారు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ నైపుణ్యాలతో భవిష్యత్‌కు సిద్ధం కావాలి

- సీఎంఆర్‌సీఈటీలో ఘనంగా ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్

**జయభేరి, మేడ్చల్ :**

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచించారు. సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఎంఆర్‌సీఈటీ)లో గురువారం ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత మల్లారెడ్డి, సీఎంఆర్ కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు తాజా పరిణామాలపై అవగాహన పెంచుకుని, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు.



**విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి:- గోపాల్‌రెడ్డి**

విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన, క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావడం ఎంతో ముఖ్యమని అన్నారు. కళాశాలలో అడుగు పెట్టిన మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకుని, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని గోపాల్ రెడ్డి సూచించారు. కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. కళాశాలలో అందుబాటులో ఉన్న ల్యాబొరేటరీలు, గ్రంథాలయం, సాంకేతిక వనరులు, వివిధ క్లబ్‌లు, సహపాఠ్య కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని, ప్రతి అవకాశాన్ని తమ భవిష్యత్ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని, విద్యార్థులు కళాశాల నిబంధనలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించడంతో పాటు ఇతరులతో స్నేహపూర్వకంగా మెలగాలని గోపాల్ రెడ్డి కోరారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిగ్రీతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, మంచి కమ్యూనికేషన్ సామర్థ్యం ఉన్నవారికే మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. అందువల్ల మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని గోపాల్‌రెడ్డి సూచించారు.




## జోగులాంబ గద్వాలలో కాంగ్రెస్ పార్టీ సమావేశం

**జయభేరి, దేవరకద్ర :**

జోగులాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి రెడ్డి అధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఓబీసీ అబ్జర్వర్ టి సి శ్రీనివాస్, ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నందిమల్ల చంద్రమౌళి ముదిరాజ్, ఓబీసీ జిల్లా అబ్జర్వర్, జిల్లా ఓబీసీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

- ఏసీపీ భాస్కర్ గౌడ్
- మేడ్చల్‌లో రహదారి ఆక్రమణల తొలగింపు




**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 14:**

రహదారి స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని మేడ్చల్ సర్కిల్ ఏసీపీ భాస్కర్ గౌడ్ తెలిపారు. శుక్రవారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కెఎల్ఆర్ వెంచర్ ఫేజ్-2లో రహదారి స్థలాన్ని ఆక్రమించి, ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ రేకుల షెడ్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏసీపీ భాస్కర్‌గౌడ్, టీపీఎస్ సాయి తేజ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజా అవసరాలు, భవిష్యత్ ట్రాఫిక్ అవసరాల కోసం కేటాయించిన రహదారి స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. దీంతో సదరు మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తొలగి రహదారి వినియోగానికి మార్గం సుగమమైంది. వెంచర్లలో రహదారుల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమించి షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపడితే భవిష్యత్‌లో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. రోడ్డు స్థలాలను అక్రమంగా ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, రహదారి ఆక్రమణలపై నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై నిరంతరం చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం




**జయభేరి, చింతపల్లి :**

మండల పరిధిలోని బోటిమిది తండా గ్రామ సమీపాన గల ఎర్రమట్టి తండాలో నిర్మిస్తున్న శ్రీ శ్రీ తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా 10000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ బంజారాలు ఎంతొ భక్తి శ్రద్ధలతో పూజించే అమ్మ వారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి చందర్ నాయక్, జైపాల్ నాయక్, బాణావత్ మున్న నాయక్,సక్రు నాయక్, హరి నాయక్,మోతిరాం నాయక్,వార్డు సభ్యులు జైపాల్ నాయక్,బావోజి గాంస్య నాయక్,కిషన్, రెడ్డి నాయక్ ,సోదరి మనులు తదితరులు పాల్గొన్నారు.

## కొర్ర బాలకృష్ణ చౌహాన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలి

- చిలకమర్రి గ్రామపంచాయతీ రేషన్ షాప్ నంబర్ 1 డీలర్




**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండలంలోని చిలకమర్రి గ్రామపంచాయతీ రేషన్ షాప్ నంబర్ 1 డీలర్‌గా విధులు నిర్వహిస్తున్న కొర్ర బాలకృష్ణ చౌహాన్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని గ్రామ సర్పంచ్ అశ్విని రాజేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బాలకృష్ణ చౌహాన్ గుడిపల్లి మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీ సభ్యునిగా కొనసాగుతూ రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. పార్టీ పదవిలో ఉంటూ రేషన్ విధులు నిర్వహించడం సరికాదని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ గుడిపల్లి మండల తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ స్ మండల పార్టీ అధ్యక్షులు ఎల్లూరి వల్లపు రెడ్డి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మునగాల అంజిరెడ్డి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకులు అర్వ పల్లి నర్సింహా తోటకూరి పరమేశ యర్ర యాదగిరి బోడ నాగరాజు కత్తుల రమేష్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వాసవి మాత పల్లకి సేవ

- అలంకరణలో దర్శనం ఇచ్చిన అమ్మవారు

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే దేవస్థానం ప్రధాన అర్చకుడు హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవాలయం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నీతో వాసవి మాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే సామూహిక కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కల్వ కన్నయ్య శెట్టి, మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి, జిల్లా మాజీ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య, దోమ హరికాంత్ లతోపాటు స్థానిక ఆర్యవైశ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# పివి స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- 300 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల భారీ ర్యాలీ

**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 14:**





హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ పీవీ పాఠశాల విద్యార్థులు దేశభక్తిని చాటుతూ 300 అడుగుల భారీ జాతీయ జెండాతో మేడ్చల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు చేతబూనిన జాతీయ జెండాలు, దేశభక్తి నినాదాలు, స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిదాయక నినాదాలతో ర్యాలీ ఉత్సాహ భరిత వాతావరణంలో సాగింది. రహదారుల వెంట ర్యాలీని చూసిన ప్రజలు విద్యార్థులను అభినందించడంతో పాటు జాతీయ జెండాకు గౌరవం తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థులు చేసిన నినాదాలు పలువురిని ఆకట్టుకున్నాయి. దేశం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల స్ఫూర్తిని నేటి తరం విద్యార్థుల్లో నింపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పీవీ పాఠశాల చైర్మన్ రామేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ నర్సింలు గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని, వారి ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యత వంటి విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేవలం స్వాతంత్ర్య దినోత్సవం రోజున మాత్రమే కాకుండా నిత్యజీవితంలోనూ దేశం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే పాఠశాల లక్ష్యమన్నారు. ఇలాంటి దేశభక్తి కార్యక్రమాలు విద్యార్థుల్లో జాతీయ భావాలను మరింత బలోపేతం చేయడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుచేసేలా చేస్తాయని వారు తెలిపారు. భవిష్యత్‌లోనూ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, అరిఫ్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.


# తీదేడు గ్రామ అభివృద్ధే లక్ష్యం

- ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, తీదేడు గ్రామ సర్పంచ్

**జయభేరి, చింతపల్లి :**



చింతపల్లి మండలం తీదేడు గ్రామ సర్వతోముఖ అభివృద్ధే లక్ష్యంగా గ్రామ సభ సమావేశం నిర్వహించడం జరిగిందని సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజల సమస్యలు మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి వారి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ...గ్రామ ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.
గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపేందుకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని,గ్రామాన్ని పరిశుభ్రంగా, సుందరంగా, అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని ఆమె తెలిపారు.మన గ్రామం మన బాధ్యత అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య,వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్, సందె లక్ష్మయ్య,మర్ల యాదగిరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమావత్ కిరణ్ కుమార్, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా నిర్మించిన గుడి గోపురానికి విరాళం

**జయభేరి, పి ఏ పల్లి :**

పీఏపల్లి మండలం లోని రాంపురం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయము దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి గుడి గోపురానికి తమ వంతు సహాయంగా 1,00,116 {ఒక లక్ష నూట పదహారు రూపాయల} రూపాయల విరాళం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాంపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ నేనావత్ అనిత లక్ష్మణ్ నాయక్, BRS పార్టీ నాయకులు ఘనపురం శంకర్ మాజీ సర్పంచ్ శివాజీ, BRS గ్రామ శాఖ అధ్యక్షులు చందు నాయక్ ,నరేష్,రవి కుమార్ ,ఇస్లావత్ కుమార్, వార్డు సభ్యులు కృష్ణ,EX సర్పంచ్ అభ్యర్థి బాలాజీ, హనుమ నాయక్ ,బాల్య నాయక్, గిరి నాయక్ ,రామ రావు ,రామచంద్ ,వార్డు సభ్యులు ప్రసాద్, భీమా నాయక్ ,చాంద్య నాయక్ ,వార్డు సభ్యులు సైదా నాయక్, ఉప సర్పంచ్ భీముడు, రవి ,జవహర్ లాల్ ,పుట్టాం గండి జబ్బార్ లాల్ నాయక్,రామ కృష్ణ,వెంకటేష్,తదితరులు పాల్గొనారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

**జయభేరి, దేవరకొండ :**

మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో ఎన్ సిసి & ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో "హర్ ఘర్ తిరంగా" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వందేమాతర గీతాన్ని ఆలపించి దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ దేశంలోని పౌరులందరూ తమ తమ ఇళ్ల పైన జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తిని చాటుతూ మన దేశ ఐక్యమత్యాన్ని ప్రపంచానికి సాటి చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్సిసి సిటిఓ & వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి. లింగారెడ్డి, ఎన్ఎస్ఎస్ డా. వి.మకట్లాల్,డా. కె.రేణుక తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు ఎన్సిసి క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ విత్ పీపుల్



**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలో 7 వ వార్డు నందు మునిసిపల్ చైర్మన్ శ్రీమతి పున్న శైలజ అధ్యక్షతన ఎమ్మెల్యే బాలునాయక్ మార్నింగ్ వాక్ విత్ పీపుల్ నిర్వహించడం జరిగింది. 7వ వార్డు కాలనీలో నిర్వహించిన "మార్నింగ్ వాక్ విత్ పీపుల్" కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలునాయక్ పాల్గొన్నారు. స్థానిక ప్రజలతో కలిసి కాలనీలో పర్యటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రూ.ఒక కోటి 55లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే బాలునాయక్ ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలనీలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తామని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న "మార్నింగ్ వాక్ విత్ పీపుల్" కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ రామదుర్గా రెడ్డి, వార్డు కౌన్సిలర్ సాయి చంద్ర గౌడ్, వార్డు కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

- రూ.2 లక్షలతో 20 కెమెరాల ఏర్పాటు..
- పూర్వ విద్యార్థి క్రాంతి కిరణ్ సేవాభావానికి అధికారులు అభినందనలు

**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 14:**



జీడిమెట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సుమారు 20 సీసీ కెమెరాలను అదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ఏరోళ్ల క్రాంతి కిరణ్ తన సొంత నిధులతో సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఈ సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. పాఠశాల తరగతి గదులు, ప్రధాన ప్రవేశ ద్వారాలు, పాఠశాల పరిసర ప్రాంతాల్లో నిఘా ఉండేలా కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేడ్చల్ పేట్ బషీరాబాద్ ఏసీపీ శంకర్ రెడ్డి, పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్ వర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు విద్యార్థుల భద్రతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పాఠశాలల్లో చిన్నారులు ఎక్కువ సమయం గడుపుతారని, వారి భద్రతకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా కొనసాగించేందుకు సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడంతో పాటు, ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగినప్పుడు దానికి సంబంధించిన వివరాలను పరిశీలించేందుకు కూడా అవకాశం ఉంటుందని ఏసీపీ పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సురక్షిత వాతావరణంలో విద్యాబోధన, విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఇటువంటి నిఘా వ్యవస్థలు దోహదపడతాయని అన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాల యాజమాన్యం విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చి సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో భద్రతా ప్రమాణాలను పెంచడంలో పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అదే పాఠశాలలో చదువుకుని, తన విద్యాభ్యాసానికి పునాది వేసిన పాఠశాలకు తిరిగి సేవ చేయాలనే ఉద్దేశంతో ఏరోళ్ల క్రాంతి కిరణ్ సుమారు రూ.2 లక్షల విలువైన 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏసీపీ శంకర్ రెడ్డి ప్రశంసించారు. ఇతర పూర్వ విద్యార్థులు కూడా తమకు సాధ్యమైన విధంగా పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

**విద్యార్థుల భద్రత అందరి బాధ్యత: సిఐ విజయ్‌వర్ధన్**

విద్యార్థుల భద్రత అందరి బాధ్యత అని పెట్ భాషిరాబాద్ సిఐ విజయ్‌వర్ధన్ అన్నారు. పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతతో పాటు పాఠశాల ఆస్తుల పరిరక్షణకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పాఠశాల పరిసరాల్లో నిరంతరం నిఘా ఉండటం వల్ల అవాంఛనీయ ఘటనలను ముందుగానే అరికట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యం అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీసీ కెమెరాలు కేవలం నిఘా కోసం మాత్రమే కాకుండా, ఏదైనా ఘటన జరిగిన సందర్భంలో వాస్తవాలను తెలుసుకోవడానికి, బాధ్యులను గుర్తించడానికి కూడా కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని ఎస్‌హెచ్‌ఓ విజయ్ వర్ధన్ అన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భద్రతపై పాఠశాల యాజమాన్యంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ, పాఠశాల ఆస్తుల పరిరక్షణ విషయంలో సీసీ కెమెరాల వ్యవస్థ మరింత సమర్థవంతంగా పని చేస్తుందని తెలిపారు. పూర్వ విద్యార్థిగా తాను చదువుకున్న పాఠశాలకు రూ.2 లక్షల విలువైన సీసీ కెమెరాల వ్యవస్థను అందించడం ద్వారా ఏరోళ్ల క్రాంతి కిరణ్ తనకు విద్య అందించిన పాఠశాలపై ఉన్న అభిమానాన్ని, సామాజిక బాధ్యతను చాటుకున్నారని అధికారులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావడం వల్ల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, పాఠశాల భద్రతా ప్రమాణాలను మరింత పెంచే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.



## గ్రామ సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్నింగ్ వాక్

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 14 :**

ప్రజా సమస్యల పరిష్కారానికి మార్నింగ్ వాక్ కార్యక్రమం ఉపయోగకరమని సర్పంచ్ బానోతు బులి వీరన్న నాయక్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశానుసారం మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గ్రామంలోని ప్రతి ఇంటి ఇంటిని తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు వచ్చిందా లేదా అని, గృహ జ్యోతి పథకం అమలు అవుతుందా లేదా అని, పెన్షన్లు వస్తున్నాయా లేదా అని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే సహకారంతో అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామ సమస్యలకు నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కూరేళ్ల నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాలమల్లు యాదవ్, కారోబార్ శ్రీశైలం, గ్రామస్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఇబ్రహీంపూర్‌లో మార్నింగ్ వాక్



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 14 :**

తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్నటువంటి లబ్ధిదారులకు నుంచి వివరాలను సేకరించారు గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివరాములు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మెండు రామ్మోహన్ రెడ్డి, నాయకులు గడ్డమీది బాలకృష్ణ, పాశం గోవర్ధన్ రెడ్డి, నాగారం కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి : ఎస్ఐ సురేష్

- నారాయణ పాఠశాలలో పదవీ బాధ్యతల స్వీకారోత్సవం



**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 14:**

మేడ్చల్‌లోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల పదవీ బాధ్యతల స్వీకారోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మేడ్చల్ ఎస్ఐ జి. సురేష్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, పాఠశాల ఏజీఎం పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్. తులసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల జెండాను ఆవిష్కరించారు. అనంతరం వివిధ హౌస్‌లకు చెందిన కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, హౌస్ కెప్టెన్లకు ముఖ్య అతిథులు బ్యాడ్జీలు, సాష్‌లు అందజేసి పదవీ బాధ్యతలను అప్పగించారు. విద్యార్థి నాయకులు ప్రతిజ్ఞ చేసి తమ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుత ప్రవర్తనతో ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణ మాసపు పూజలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించిన వాసవి మహిళలు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదములు మహాప్రసాదం వితరణ నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య, అధ్యక్షులు చీదెళ్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి కొత్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## పరవాడ మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా పైలా జన్మదిన వేడుకలు

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్న ఆధ్వర్యంలో జిల్లా తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జడ్పిటిసి పైల జగన్నాథ రావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు పాల్గొని పైల రామచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆయనతో జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ యొక్క కార్యక్రమంలో కన్నూరు వెంకటరమణ, గొర్లి కనకారావు, జలపాల రాము, కూండ్రపు మధు, బోండా తాతారావు, సారిపల్లి జోగి నాయుడు, నాగిరెడ్డి చిన్నారావు, డి ఎం ఎల్ నాయుడు, సూర్యచంద్ర, బాలు మరియు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయడంతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

## పైడిమాంబ వాకర్స్ ఆధ్వర్యంలో పైల రామచంద్రరావు జన్మదిన వేడుకలు



**జయభేరి, పరవాడ:**

పైడిమాంబ వాకర్స్ ఆధ్వర్యంలో వాకర్స్ సభ్యుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు జన్మదిన వేడుకలను పైడిమాంబ గుడి వద్ద తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు వాకింగ్‌లో పాల్గొనే పైడిమాంబ వాకర్స్ సభ్యులు పైల రామచంద్రరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి ఆయనతో జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తెల్లవారుజామునే పైడిమాంబ గుడి వద్ద వాకర్స్ సభ్యులు హాజరై ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయడంతో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ నిరంతర పోరాటం

- హామీల అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టత ఇవ్వాలి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 14 :**



ప్రజా సమస్యలపై పోరాటమే సిపిఐ లక్ష్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రారంభమై ములకలపల్లి, వాసాలమర్రి, గోపాలపురం, తిరుమలపురం, గంధమల్ల, ఇబ్రహీంపూర్, దత్తాయిపల్లి గ్రామాల్లో జాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీకి ప్రజల మద్దతు మరింత పెరగాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుందని ఆరోపించారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్న ప్రజల ఆదాయాలు మాత్రం పెరగడం లేదన్నారు. నిరుద్యోగము కార్మికుల సమస్యలు రైతుల ఇబ్బందులు పేదలపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాపాడుతూ వారికి ఉద్యోగ భద్రత కనీస వేతనాలు సామాజిక భద్రత కల్పించాలని అన్నారు. రైతు పంటలకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ రంగాన్ని రక్షించాలని కోరారు. ధరల పెరుగుదలను అరికట్టాలని పేదలు, కార్మికులు రైతుల సమస్యలను పరిష్కరించాలని, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోదా శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి కళ్యాణ్ కృష్ణ, డి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఇంజ హేమలత, సిపిఐ మండల కార్యదర్శి సిల్వర్ దుర్గయ్య, సహాయ కార్యదర్శి గుంటుపల్లి సత్తయ్య, వల్లపు భగవంతు, జిన్న రజిత, సిల్వేరు స్వరూప, ప్రజానాట్యమండలి కళాకారులు శాగ భాను, గజ్వేల్ నటరాజు, కన్నాయి మనోహర, ఇంజ శ్రీను పాల్గొన్నారు.

# దొంగల బీభత్సం.. ఇంట్లో చోరీ..

- 4½ తులాల బంగారం, రూ.2 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 14 :**



తుర్కపల్లి మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన గుండెబోయిన లావణ్య తన ఇంటికి తాళం వేసి ఉదయం 10 గంటలకు కూలీ పనికి వెళ్లారు. సాయంత్రం 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చి పరిశీలించగా బెడ్ రూమ్ లోనూ, అల్మారాలను భద్రపరిచిన బంగారు ఆభరణాలు నగదు కనిపించడం లేదని గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ముందు ఉన్న సెల్ఫ్ లో దాచిపెట్టిన తాళాలను ఉపయోగించి బెడ్ రూమ్ తలుపులు తెరిచి ఇంట్లోకి ప్రవేశించారని ఆల్మరా తెలిసి సుమారు నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు లక్షల నగదు అపహరించాలని తుర్కపల్లి పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా తుర్కపల్లి ఎస్ఐ శివకృష్ణ కేసు నమోదు చేసుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు క్లోస్ టీం ఫింగర్ ప్రింట్స్ నిపుణుల సహాయంతో సంఘటన స్థలంలో ఆధారాలను సేకరించారు గుర్తు తెలియని నిందితులను గుర్తించి పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి తాళాలను సురక్షితమైన ప్రదేశంలో భద్రపరుచుకోవాలని అలాగే నగదు బంగారు ఆభరణాలు విలువైన వస్తువులను ఇంట్లో భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటిని ఎక్కువసేపు వదిలి వెళ్ళే సందర్భాల్లో ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వడంతో పాటు హనుమనాస్పద వ్యక్తులు కదలికలను కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. దొంగలను కచ్చితంగా పట్టుకుంటామని అన్నారు.

## వివాహ వేడుకకు ఆర్థిక చేయూత అందించిన కౌన్సిలర్ శ్రీలత రమేష్




**జయభేరి, మేడ్చల్, ఆగస్టు 14:**

వివాహ కార్యక్రమాలు పేద కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారుతున్న నేపథ్యంలో తమ వంతుగా సహకారం అందించడం బాధ్యతగా భావిస్తున్నట్లు ఎల్లంపేట్ మున్సిపల్ కౌన్సిలర్ శ్రీలత రమేష్ తెలిపారు. శుక్రవారం ఎల్లంపేట్ గ్రామానికి చెందిన పోచయ్య-సద్గుణ దంపతుల కుమార్తె వివాహానికి మున్సిపల్ కౌన్సిలర్ నీరుగంటి శ్రీలత రమేష్ యాదవ్ రూ.11 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నీరుగంటి శ్రీలత రమేష్ యాదవ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలకు, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని అన్నారు. వివాహం అనేది ప్రతి కుటుంబానికి ఎంతో ముఖ్యమైన ఘట్టమని, ఆ సమయంలో చిన్న పాటి సహాయం కూడా వారికి ఎంతో ఊరట నిస్తుందని పేర్కొన్నారు. నూతన దంపతులు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ యువ నాయకుడు మాసాని శ్రీకాంత్ ముదిరాజ్, ఎల్లంపేట్ గ్రామ మాజీ మహిళా అధ్యక్షురాలు కారింగుల దీపిక పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన కౌన్సిలర్ శ్రీలత రమేష్ యాదవ్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అందం ఫుల్లే అవకాశాలు నిల్లే:




ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. ఆమె అంటే కుర్రకారు పడిచచ్చిపోతారు. చేసింది తక్కువ సినిమాలే అయినా విపరీతమైన క్రేజ్ తెచ్చుకుంది. నిజం చెప్పాలంటే సౌత్ ఇండస్ట్రీలో గ్లామర్ ఇమేజ్ సంపాదించుకున్న ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే సెన్సేషన్ అయ్యింది. బ్యాక్ టూ బ్యాక్ చిత్రాలతో అలరించి తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. తనే నేహా శెట్టి. యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ నటించిన డిజే టిల్లు సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఈ మూవీతో ఒక్కసారిగా గ్లామర్ క్రేజ్ సంపాదించుకుంది. డీజే టిల్లు తర్వాత నేహాకు తెలుగు ప్రేక్షకుల నుంచి ఓ రేంజ్ క్రేజ్ వచ్చేసింది. దీంతో టాలీవుడ్ ఇండస్ట్రీలో నేహాకు వరుస అవకాశాలు క్యూ కట్టాయి. మాస్ కా దాస్ విశ్వక్ దాస్ హీరోగా నటించిన గ్యాంగ్ ఆఫ్ గోదావరి చిత్రంలో కనిపించింది. హీరో కార్తికేయ జోడిగా బెదురులంక 2012 చిత్రంలో నటించింది. అయితే అందమెంత ఉన్న ఇప్పటికీ ఈ ముద్దుగుమ్మ స్టార్ డమ్ మాత్రం రాలేదు. కానీ ఈ బ్యూటీ క్రేజ్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. స్టార్ హీరోయిన్ కు మించి పాపులారిటీ సొంతం చేసుకుంది. ఓవైపు సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఇటీవలే మరోసారి టిల్లు స్క్వేర్ చిత్రంలో కనిపించింది. ఆ తర్వాత మరో ప్రాజెక్ట్ అనౌన్స్ చేయలేదు. అందంతో కవ్వించిన ఆశించినస్థాయిలో అవకాశాలు మాత్రం అందుకోలేకపోయింది ఈ ముద్దుగుమ్మ. కానీ సోషల్ మీడియాలో ఈ అమ్మడు చేసే రచ్చ గురించి చెప్పక్కర్లేదు. నిత్యం లేటేస్ట్ గ్లామర్ ఫోటోషూట్లతో ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. ఈ ముద్దుగుమ్మ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. కుర్రకారు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



# పోతురాజు ఆహార్యంలో మేఘాంశ్

రియల్‌స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా ఓ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతున్నది. లెల్లా రోహిత్ దర్శకుడు. లెల్లా రాహుల్ నిర్మాత. ఆగస్ట్ 15న శ్రీహరి జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సంస్కృతిలో భాగమైన పోతురాజు ఆహార్యంలో ఉన్న మేఘాంశ్ శ్రీహరి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోతురాజు గెటప్‌లో మేఘాంశ్ కనిపిస్తుండగా, అతని నేపథ్యంలో శ్రీహరి కూడా కనిపిస్తుండటం ఈ ఫస్ట్‌లుక్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే 50శాతం ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసుకున్నదని, త్వరలోనే టైటిల్ గ్లింప్స్‌ని కూడా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ గ్లింప్స్ ద్వారా ఈ సినిమాలోని హీరో ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్టు వారు తెలిపారు.

# కర్నల్ వెంకట్‌రెడ్డి కామెడీ



అగ్ర కథానాయకుడు వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి ఓ భారీ వినోదాత్మక మల్టీస్టారర్‌ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ సరసన కీర్తి సురేశ్, కల్యాణ్‌రామ్‌కి జోడీగా కృతి శెట్టి నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. 40ఏండ్ల సినీ ప్రస్థానాన్ని వెంకటేశ్ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇండియన్ ఆర్మీ యూనిఫామ్‌లో, సన్ గ్లాసెస్, స్కార్ఫ్ ధరించి పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న వెంకటేశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఓ స్పోర్ట్ యుటిలిటి వెహికల్ పక్కన నిల్చుని సీరియస్‌గా చూస్తున్న ఆయన లుక్‌ని బట్టి ఇందులో రగ్‌గ్‌డ్ మిలటరీ ఆఫీసర్‌గా వెంకటేశ్ కనిపించబోతున్నారనే విషయం అర్థమవుతున్నది. కౌంటర్ టెర్రరిజం, హోస్టేజ్ నెగోషియేషన్‌లో నిపుణుడైన 'కర్నల్ వెంకట్‌రెడ్డి'గా ఈ పోస్టర్ ద్వారా వెంకటేశ్‌ని పరిచయం చేశారు. వెంకీ, కల్యాణ్‌రామ్ మధ్య ఉండే కెమిస్ట్రీ, కామెడీ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చనున్నాయని, హ్యూమర్, ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాతో సాగే అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సమర్పణ: సురేశ్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, శ్రీమతి అర్చన.



# ఒక్కో సినిమాకు రూ.12 కోట్లు..

ఒకప్పుడు ఆమె చైల్డ్ ఆర్టిస్ట్.. దక్షిణాది నుంచి నార్త్ ఇండస్ట్రీ వరకు సినిమాల్లో నటించిందని తెలిసి ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఆమెకు సంబంధించిన ఫోటోస్ ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. అందులో బాలీవుడ్ 'పంగా క్వీన్' కంగనా రనౌత్ వెనుక ఒక నటి గుంపులో నిలబడి ఉంది. ఆ సమయంలో ఆ నటి 6వ తరగతి చదువుతోంది. కానీ ఇప్పుడు కోట్లాది మంది హృదయాలు గెలుచుకుంది. ఆమె మరెవరో కాదు.. న్యాచులర్ బ్యూటీ.. లేడీ పవర్ స్టార్ సాయి పల్లవి. 2015లో విడుదలైన ప్రేమమ్ సినిమా మాత్రం ఆమె లైఫ్ మార్చేసింది. ఆ తర్వాత ఫిదా మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి స్టార్ డమ్ సంపాదించుకుంది. 2008లో విడుదలైన ఈ చిత్రాన్ని దివంగత డైరెక్టర్ జీవా తెరకెక్కించారు. ఈ సినిమాలో జయం రవి, కంగనా రనౌత్, లక్ష్మీ రాయ్, జయరామ్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో సాయి పల్లవి, షెన్బా (కంగనా) స్నేహితురాలి పాత్రను పోషించారు. ప్రస్తుతం సాయి పల్లవి పాన్ ఇండియా క్రేజీ హీరోయిన్. డ్యాన్స్ లో ఎలాంటి శిక్షణ లేకుండానే తెలుగులో ఢీ షోలో పాల్గొని తన అదృష్టం పరీక్షించుకుంది. అయితే, గ్రాండ్ ఫినాలేకు చేరుకున్నప్పటికీ ఆమె ఆ షోను గెలవలేకపోయింది. ధనుష్‌తో కలిసి ఆమె పాడిన 'రౌడీ బేబీ' పాట యూట్యూబ్‌లో 100 కోట్లకు పైగా వ్యూస్ సాధించి చారిత్రాత్మక ప్రపంచ రికార్డు సృష్టించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు 4000 కోట్ల బడ్జెట్ తో రూపొందిస్తున్న రామాయణం చిత్రంలో సీతమాత పాత్రలో నటిస్తుంది. ఈ చిత్రానికి ఆమె రూ. 12 కోట్లు పారితోషికం తీసుకుంటున్నట్లు టాక్. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు.

# నేనూ సైబర్ నేరానికి గురయ్యా.. మా ఇంట్లో వాళ్లను డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించారు: నాగార్జున



'ఐదేండ్ల క్రితం బ్యాంక్ అధికారిని అంటూ ఓ వ్యక్తి నాకు ఫోన్ చేశాడు. బిజినెస్‌లో నేను చాలా స్మార్ట్ అంటూ టెంప్ట్ చేశాడు. తాను చెప్పే ఇన్వెస్ట్‌మెంట్‌తో భారీ లాభాలు వస్తాయని చెప్పాడు. ఆఖరికి నా పేరు కూడా చెప్పేసరికి ఓ దశలో నమ్మేశా' అంటూ తనకు ఎదురైన సైబర్ నేరం గురించి సినీ నటుడు అక్కినేని నాగార్జున తెలియజేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'సురక్ష కా తిరంగా' కార్యక్రమానికి హాజరైన ఆయన సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మా కుటుంబంలో ఒకరిని 67 గంటలపాటు డిజిటల్ అరెస్టు చేశారు. విదేశాలకు నారోటిక్ సబ్‌స్టాన్స్ పార్సిల్ పంపారంటూ కాల్స్ చేశారు. ఆ ఘటన తీవ్ర భయాందోళనకు గురి చేసింది. ఈ విషయం సీవీ ఆనంద్‌కు తెలుసు అంటూ డిజిటల్ మోసాలు ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. కొత్తతరహా సైబర్ నేరాలపై స్పందిస్తూ.. ఫోన్ హ్యాక్ అవుతుందనే భయం ఎప్పుడూ ఉంటుంది. అందుకే ఎంతో జాగ్రత్తగా ఉంటాను. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్, నెలరోజులకు ఒకసారి వైఫై పాస్‌వర్డ్ మార్చేస్తాను. వ్యక్తిగత ఫొటోలను మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకోను అంటూ సైబర్ నేరాలపై నాగార్జున అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉన్నప్పుడే సైబర్ నేరాల నుంచి తప్పించుకోవచ్చని అన్నారు. సైబర్ నేరాలు, సినిమా పైరసీ అరికట్టడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని అభినందించారు. సినీ ఇండస్ట్రీలో పైరసీ భూతాన్ని తరిమికొట్టడంలో సీవీ ఆనంద్, వీసీ సజ్జనార్ విశేష కృషి చేశారని కొనియాడారు.

**సైబర్ బాధితుల్లో రిటైర్డ్ ఉద్యోగులే అధికం**

సైబర్ నేరాల బారిన పడుతున్నవారిలో రిటైర్డ్ ఉద్యోగులే అధికంగా ఉంటున్నారని డీజీపీ సీవీ ఆనంద్ ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే 'సురక్ష కా తిరంగా'లో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లను భాగస్వామ్యం చేశామని వెల్లడించారు. వీరితోపాటు ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు డీజీపీ చెప్పారు. నేరాల స్వరూపం ఎప్పటికప్పుడు మారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో భౌతికంగా దోపిడీలు ఎకువగా జరిగేవని, ప్రస్తుతం నారోటిక్, సైబర్ నేరాలు పెరిగిపోయాయని అన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్ సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్, సీఎస్‌బీ, అధికసంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**